సాక్షి
మంచిర్యాల
మంగళవారం । 11 । జూలై । 2023



ప్రభం'జనం' ఆపుదాం..
పెరుగుతున్న జనాభాతో దుష్పరిణామాలు తప్పట్లేదు. ఈ మేరకు ప్రజలకు అవగాహన కల్పించేందుకు ఏటా జూలై 11న ప్రపంచ జనాభా దినోత్సవం నిర్వహిస్తున్నారు.
8లో ▸

ఘనంగా జాతీయ మత్స్యకార దినోత్సవం
మంచిర్యాలఅగ్రికల్చర్: జాతీయ మత్స్య రైతు దినోత్సవాన్ని సోమవారం జిల్లా మత్స్యశాఖ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. జిల్లా మత్స్యకార శాఖ అధికారి సత్యనారాయణ మత్స్యకారులకు అవగాహన కల్పించారు. జూలై, ఆగస్టులో చేపల వేట నిషేధం, ప్రభుత్వ పథకాలు, రాయితీవాటిపై సూచనలు చేశారు. మత్స్యశాఖ అధికారులు రాందన్, చిన్నయ్య, గంగపుత్ర సంఘం జిల్లా అధ్యక్షుడు నెన్నెల నర్సయ్య, గుమ్మల శ్రీనివాస్, సుదర్శన్, మహేష్ పాల్గొన్నారు.

గరిష్టం/కనిష్టం
34.0 /26.0

వాతావరణం
ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. రాత్రివేళ ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసే అవకాశం ఉంది. ఈదురు గాలులు బలంగా వీస్తాయి.

న్యూస్‌రీల్

అవకాశాలు సద్వినియోగం చేసుకోవాలి



ధ్రువపత్రాలు అందిస్తున్న కలెక్టర్ సంతోష్

నస్పూర్: జిల్లాలోని ట్రాన్స్‌జెండర్లు ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ అన్నారు. సోమవారం నస్పూర్‌లోని కలెక్టర్ చాంబర్‌లో ఐదుగురికి గుర్తింపు కార్డుతోపాటు ట్రాన్స్‌జెండర్ ధ్రువపత్రాలు అందించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం ట్రాన్స్‌జెండర్లకు అవకాశాలు కల్పిస్తోందని, రిజర్వేషన్లు, గుర్తింపు కార్డులు అందించి ప్రభుత్వ సంక్షేమ పథకాలు వర్తింపజేస్తోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ శాఖ అధికారి కే.చిన్నయ్య, జిల్లా బాలల పరిరక్షణ అధికారి ఆనంద్, సీనియర్ అసిస్టెంట్ రఘువీర్, తదితరులు పాల్గొన్నారు.

యూనిఫామ్ సివిల్ కోడ్‌పై అవగాహన అవసరం

చెన్నూర్: ఒక్కటే దేశం ఒక్కటే చట్టం, యూనిఫామ్ సివిల్ కోడ్‌పై అందరికీ అవగాహన అవసరమని వరంగల్‌కు చెందిన అడ్వకేట్, టాక్స్ ప్రాక్టీషనర్ సౌమిత్రి లక్ష్మణాచారి అన్నారు. స్థానిక పద్మశాలి కళ్యాణ మండపంలో సోమవారం తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం, ఏబీవీపీ చెన్నూర్ విభాగం ఆధ్వర్యంలో యూనిఫామ్ సివిల్ కోడ్‌పై అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన యూసీసీపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో తపస్ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్‌రావు, ఆర్‌ఎస్‌ఎస్ ఖండ కార్యవాహ రత్న లక్ష్మీనారాయణరెడ్డి, ఏబీవీపీ నాయకులు మామిడి అక్షిత పాల్గొన్నారు.

ధాన్యం డబ్బులు చెల్లించాలి

బెల్లంపల్లి: బెల్లంపల్లి మండలం చంద్రవెల్లి వ్యవసాయ సహకార సంఘం ద్వారా ధాన్యం అమ్మకాలు చేసిన రైతులకు పూర్తి స్థాయిలో డబ్బులు వెంటనే చెల్లించాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కొయ్యల ఏమాజీ డిమాండ్ చేశారు. సోమవారం సహకార సంఘం కార్యాలయం ఆవరణలో ఆయన మాట్లాడారు. సహకార సంఘం కొనుగోలు కేంద్రంలో పెర్కపల్లి గ్రామానికి చెందిన మేడం శంకరయ్య వద్ద 625 బస్తాలు, సింగతి రాజయ్య వద్ద 843 బస్తాల ధాన్యాన్ని తూకం వేసి కాసిపేట మండలంలోని గోదాంలకు తరలించారని వివరించారు. 45 రోజులు గడుస్తున్నా డబ్బులు చెల్లించలేదని తెలిపారు. డబ్బుల కోసం రైతులు సహకార సంఘం అధికారులను అడిగితే శంకరయ్యకు చెందిన 33 బస్తాలు, రాజయ్యకు సంబంధించి 67 బస్తాలు తక్కువ ఉన్నట్లు చెబుతున్నారని అన్నారు. అవకతవకలపై కలెక్టర్, జిల్లా పౌరసరఫరాల అధికారి విచారణ జరిపి బాధ్యులపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు కేశవరెడ్డి, అసెంబ్లీ జాయింట్ కన్వీనర్ రాజులాల్ యాదవ్, బాధిత రైతులు పాల్గొన్నారు.

పూర్తి సమాచారంతో గణాంక దర్శిని రూపకల్పన

నస్పూర్: జిల్లాకు సంబంధించిన పూర్తి సమాచారంతో గణాంక దర్శిని రూపొందించినట్లు కలెక్టర్ బాదావత్ సంతోష్ తెలిపారు. సోమవారం ఆయన నస్పూర్‌లోని సమీకృత కలెక్టరేట్‌లో ముఖ్య ప్రణాళిక శాఖ ఆధ్వర్యంలో రూపొందించిన గణాంక దర్శిని(2021-22) పుస్తకాన్ని జిల్లా అదనపు కలెక్టర్ బి.రాహుల్, ట్రైనీ కలెక్టర్ పి.గౌతమి, మంచిర్యాల ఆర్డీఓ వేణు, ముఖ్య ప్రణాళిక అధికారి జి.సత్యం, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి బి.శేషాద్రితో కలిసి ఆవిష్కరించారు. కలెక్టర్ మాట్లాడుతూ గణాంక దర్శినిలో జిల్లాకు సంబంధించిన పూర్తి సమాచారం లభిస్తుందని తెలిపారు.

బ్యాడ్మింటన్ పోటీల ఏర్పాట్ల పరిశీలన




ఏర్పాట్లను పరిశీలిస్తున్న అసోసియేషన్ సభ్యులు

మంచిర్యాలటౌన్: జిల్లా కేంద్రంలోని మాస్టర్ బ్యాడ్మింటన్ అకాడమీలో ఈ నెల 11 నుంచి ప్రారంభం కానున్న రాష్ట్రస్థాయి బ్యాడ్మింటన్ పోటీల ఏర్పాట్లను ఉమ్మడి జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ చీఫ్ అడ్వైజర్ గాజుల ముఖేశ్ గౌడ్ సోమవారం పరిశీలించారు. ఈ నెల 11న క్వాలిఫయింగ్ మ్యాచ్‌లు, 12 నుంచి 14వరకు టోర్నమెంట్ మెయిన్ డ్రా పోటీలు ఉంటాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి పుల్లూరి సుధాకర్, ట్రెజరర్ సత్యపాల్‌రెడ్డి, కార్యవర్గ సభ్యుడు పీఎస్.రావు, జిల్లా అసోసియేషన్ బాధ్యులు రమేశ్‌రెడ్డి, మధు, నవీన్‌బాబు, పీఈటీలు పాల్గొన్నారు.

మధ్యవర్తులదే హవా!



జిల్లా కేంద్రంలోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం



- సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో మారని తీరు
- ఒక్కో డాక్యుమెంట్ ఒక్కో రేటు ఫిక్స్
- 'సేవల' పేరుతో అదనపు బాదుడు
- లిటిగేషన్లు ఉంటే మరింత అదనం

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ కార్యాలయాల్లో మధ్యవర్తుల హవా నడుస్తోంది. పౌరులు తమ ఆస్తుల కొనుగోళ్లు, అమ్మకాల రిజిస్ట్రేషన్లకు డాక్యుమెంటరీ రైటర్లను ఆశ్రయించాల్సి వస్తోంది. ప్రభుత్వం డాక్యుమెంట్ రైటర్లకు ఎటువంటి అధికారిక లైసెన్స్‌లు ఇవ్వకున్నా ఈ వ్యవస్థ ఆగడం లేదు. దీంతో ప్రజలు సైతం యధావిధిగా మధ్యవర్తుల ఆధారంగానే రిజిస్ట్రేషన్లు సాగిస్తున్నారు. ఏళ్లుగా వ్యవస్థీకృతమైన తీరుతో ఒక్కో డాక్యుమెంట్‌కు ఒక్కో రేటు అన్న చందంగా మారింది. జిల్లాలో మంచిర్యాల, లక్సెట్టిపేటలో రెండు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు ఉన్నాయి. రోజుకు ఈ రెండు చోట్ల సగటున 60నుంచి 80వరకు రిజిస్ట్రేషన్లు జరుగుతుంటాయి. ఏటా జిల్లా నుంచి సగటున రూ.50కోట్ల వరకు ప్రభుత్వానికి ఆదాయం వస్తోంది. కార్యాలయాల్లో 17రకాల సేవల్లో సగం వరకు మార్టిగేజ్‌లు ఉండగా మిగతావి, అమ్మకాలు, గిఫ్ట్ రిజిస్ట్రేషన్లు, సంస్థలు, చిట్స్ రిజిస్ట్రేషన్లు, వివాహాల నమోదు తదితర రకాల సేవలు పొందుతున్నారు. అయితే ఈ అంశాలపై అవగాహన లేక చాలామంది విద్యావంతులు సైతం మధ్యవర్తులనే ఆశ్రయిస్తున్నారు. ఇదే అదనుగా వసూళ్లకు పాల్పడుతున్నారు. ఇక రియల్ వ్యాపారస్తులు సైతం ప్లాట్ల కొనుగోలుదారుల నుంచి రిజిస్ట్రేషన్ల పేరుతో అదనపు వసూళ్లు చేస్తున్నారు. ఇటీవల సింగరేణి స్థలాల క్రమబద్ధీకరణ సమయంలోనూ కొందరు తమ చేతివాటం ప్రదర్శించారు.

అనధికార లేఅవుట్ల సాకుతో..
ప్రభుత్వం నుంచి అనుమతులు, డీటీసీపీ ఉన్న వెంచర్ల కొనుగోలు చేసిన వాటికి ఎటువంటి ఇబ్బంది ఉండదు. జిల్లాలో అనేకంగా గ్రామాలు, పట్టణాల్లో అనధికార లేఅవుట్లే ఉన్నాయి. కొన్ని వెంచర్లలో ఇంకా ఎల్‌ఆర్‌ఎస్ పెండింగ్‌లోనే ఉంది. మరికొన్ని చోట్ల వెంచర్ల ప్లాట్లకు రిజిస్ట్రేషన్లు చేయొద్దని ఆదేశాలు ఉన్నాయి. వీటిని సాకుగా చూపి మధ్యవర్తులు రూ.30వేల నుంచి రూ.50వేలకు వసూలు చేస్తున్నారు. ఇక రోజువారీగా ఉండే రెగ్యులర్ డాక్యుమెంట్లకు సంబంధించిన సేవల పేరుతో ఒక్కో డాక్యుమెంట్‌కు రూ.3వేల నుంచి రూ.5వేల వరకు తీసుకుంటున్నారు. ఇందులో భూ క్రయ విక్రయాలు, విలువైన స్థిరాస్తికి సంబంధించినవి ఉంటే మరింత అదనంగా తీసుకుంటున్నారు. చాలామంది డాక్యుమెంటరీ రైటర్లే రియల్ వ్యాపారంలో ఉండడంతో అనుమతులు లేని ప్లాట్లకు కూడా రిజిస్ట్రేషన్లు కానిచ్చేస్తున్నారు. ఇక అసైన్డ్, సింగరేణి, ప్రభుత్వ భూములను సైతం నిబంధనలకు విరుద్ధంగా రిజిస్ట్రేషన్లు చేయిస్తున్నారు. సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం చుట్టూ డాక్యుమెంటరీ కార్యాలయాలే ఉండడంతో ఎవరైనా సొంతంగా డాక్యుమెంట్ చేసుకుని వచ్చినా తమది చెల్లదనే భావన కలిగేలా వాతావరణం ఏర్పడింది. ఎంతవారైనా డాక్యుమెంటరీ రైటర్లను ఆశ్రయించక తప్పడం లేదు. ఇక లిటిగేషన్ల భూములు, వివాదాస్పదం ఉన్న చోట్ల మరింత ఎక్కువగా దండుకుంటున్నారు. ఈ వసూళ్లలో కార్యాలయంలో కింది నుంచి పై వరకు వాటాలు ఉంటాయనే ఆరోపణలు ఉన్నాయి. ఈ వాటాల్లో ప్రైవేటు, రెగ్యులర్ ఉద్యోగులకు అందుతున్నాయి.

అవసరమే లేకున్నా...
వాస్తవానికి ప్రభుత్వ నిబంధనల ప్రకారం తెల్ల కాగితంపై రాసుకుని వచ్చినా క్రయ విక్రయాలకు సంబంధించి రిజిస్ట్రేషన్లు చేసుకోవచ్చు. కేవలం బాండ్, లీగల్ పేపర్లపై రాస్తేనే, రిజిస్ట్రేషన్లు చేస్తారనే భావన జనంలో నాటుకుపోయింది. అంతేకాక లావాదేవీలు చేసేటప్పుడు ప్రత్యేక రాత ఉండాల్సిన అవసరం ఉన్నట్లుగా చెబుతూ మధ్యవర్తులను ఆశ్రయించాల్సిన అవసరం సృష్టించడంతో ఇదే తంతు ఏళ్లుగా కొనసాగుతోంది. ప్రభుత్వ రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లో అవినీతిని నిరోధించి, పారదర్శకతను పెంచే గుడ్ గవర్నెన్స్‌లో భాగంగా సిటిజన్ చార్టర్ అమలులోకి వచ్చింది. ఏ సేవకు ఎంత చెల్లించాలి, ఎన్ని రోజుల్లో పొందాలి అనే వివరాలు పొందుపర్చింది. ఇప్పటికీ డాక్యుమెంట్లు రాత పూర్వకంగానే కొనసాగుతుండడం, స్టాంప్ డ్యూటీ, సాక్ష్యాలు, పేపర్లు తదితర వాటిని అన్ని చక్కబెడతామంటూ మధ్యవర్తులు తమ సేవల పేరుతో చార్జీలు తీసుకుంటున్నారు. దీంతో ప్రజలు వాస్తవ ఫీజుల కంటే అధికంగా చెల్లించుకోవాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది.

అవసరం లేదు
పౌరులు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో ఏ సేవలకైనా మధ్యవర్తులను ఆశ్రయించాల్సిన అవసరం లేదు. తెల్లకాగితంపై రాసుకుని వచ్చినా రిజిస్ట్రేషన్ చేస్తాం. కానీ చాలామంది అవగాహన లేక ఇతరులపై ఆధారపడుతున్నారు. కార్యాలయంలో ఎవరైనా నిబంధనలకు విరుద్ధంగా డబ్బులు వసూలు చేస్తే చర్యలు తీసుకుంటాం.
– రాము రేగళ్ల, సబ్ రిజిస్ట్రార్, మంచిర్యాల

రేషన్ బియ్యం పంపిణీ ఆలస్యం

- దుకాణాలకు చేరని వైనం
- బయోమెట్రిక్‌తో డీలర్లకు సరఫరా



నస్పూర్ ఎంఎల్‌ఎస్ పాయింట్‌లో బయోమెట్రిక్

మంచిర్యాలటౌన్: పౌరసరఫరాల శాఖ ద్వారా ప్రతీ నెల ఒకటో తేదీ నుంచి 15వరకు అందించాల్సిన రేషన్ బియ్యం పంపిణీ ఈ నెలలో 10నుంచి ప్రారంభానికి ఆ శాఖ ఆదేశాలు జారీ చేసింది. గతంలో ఎంఎల్‌ఎస్(మండల్ లెవల్ స్టాక్) పాయింట్ల నుంచి రేషన్ దుకాణాలకు బియ్యం సరఫరా సమయంలో ప్రతీ బస్తాలో కొంత తరుగు వస్తుండడంతో ఆ భారం డీలర్లపై పడుతోంది. పూర్తి పారదర్శకంగా బియ్యాన్ని దుకాణాలకు చేరవేసేందుకు పౌరసరఫరాల శాఖ చర్యలు తీసుకుంది. ఇందుకోసం ఎంఎల్‌ఎస్ పాయింట్లలో రేషన్ డీలర్లు, వారి కుటుంబ సభ్యులకు సంబంధించిన ముగ్గురి వేలిముద్రల సేకరణ చేపట్టింది. ఈ ప్రక్రియ ఈ నెలలోనే ప్రారంభించడంతో బియ్యం గోదాముల నుంచి రేషన్ దుకాణాలకు చేరవేసే క్రమంలో డీలర్లు బయోమెట్రిక్ విధానంతో వేలిముద్రలు వేస్తున్నారు. ఈ ప్రక్రియ ఆలస్యం కావడంతోపాటు ఈ నెలలో 6 కిలోలకు బదులుగా 12 కిలోలు ఉచితంగా ఒక్కో లబ్ధిదారుడికి ఇవ్వాలని మొదట నిర్ణయించినా, ఆ తర్వాత 6 కిలోలు ఇవ్వాలని నిర్ణయించడంలో జరిగిన ఆలస్యంతో ఈ నెల 10 నుంచి లబ్ధిదారులకు బియ్యం పంపిణీ చేయాలని పౌరసరఫరాల శాఖ ఆదేశించింది. కానీ జిల్లాలో ఎంఎల్‌ఎస్ పాయింట్ల నుంచి రేషన్ బియ్యం జిల్లాలోని అన్ని దుకాణాలకు చేరకపోవడంతో సోమవారం అక్కడక్కడ మాత్రమే పంపిణీని ప్రారంభించారు. జిల్లావ్యాప్తంగా 423 రేషన్ దుకాణాలు ఉండగా కార్డుదారులు 2,19,424, లబ్ధిదారులు 6,51,606 మంది ఉన్నారు. వీరికిగాను జూలై నెలకు 3,317 మెట్రిక్ టన్నుల బియ్యం సరఫరా చేయాల్సి ఉండగా, 206 మెట్రిక్ టన్నుల బియ్యం మాత్రమే పంపిణీ చేశారు. దీంతో మూసి ఉన్న రేషన్ దుకాణాలే దర్శనమిస్తున్నాయి.

సమస్యల పరిష్కారానికే ప్రజావాణి

- కలెక్టర్ బాదావత్ సంతోష్



ప్రజావాణిలో ఫిర్యాదులు స్వీకరిస్తున్న కలెక్టర్ బాదావత్ సంతోష్

నస్పూర్: ప్రజల సమస్యల పరిష్కారానికే ప్రజావాణి కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ బాదావత్ సంతోష్ తెలిపారు. నస్పూర్‌లోని సమీకృత కలెక్టరేట్‌లో జిల్లా అదనపు కలెక్టర్ రాహుల్, ట్రైయినీ కలెక్టర్ గౌతమి, మంచిర్యాల ఆర్డీవో వేణులతో కలిసి సోమవారం అర్జీలు స్వీకరించారు. తమ సమస్యలు పరిష్కరించాలని పలువురు అర్జీలు సమర్పించారు.

- నస్పూర్ శివారు సర్వేనంబరు 42, మంచిర్యాల శివారు సర్వేనంబరు 422 ప్రభుత్వ భూముల్లో అక్రమాలు జరుగుతున్నాయని, విచారణ జరపాలని పౌరసేవాసంస్థ ప్రతినిధి తులా మధుసూదన్‌రావు కోరారు.
- దళితబంధు పథకంలో రాజకీయ జోక్యం లేకుండా లబ్ధిదారులను ఎంపిక చేయాలని, గృహలక్ష్మి, పోడుపట్టాలు, జీవో 58, 59ద్వారా అర్హులైన పేదలకు పట్టాలు కేటాయించాలని తెలంగాణ దళిత హక్కుల పోరాట సమితి జిల్లా కార్యదర్శి దేవి పోచన్న ఆధ్వర్యంలో అర్జీ అందజేశారు.
- తన భర్త రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడని, ఏదైనా ఉద్యోగ అవకాశం కల్పించి ప్రభుత్వ పరంగా ఆర్థిక ప్రయోజనం కల్పించాలని నస్పూర్ మండలం శ్రీరాంపూర్‌కు చెందిన పాడేటి లక్ష్మి విన్నవించింది.
- లక్సెట్టిపేట మండలం దౌడపల్లి గ్రామానికి చెందిన కేతిరెడ్డి సత్యనారాయణరెడ్డి తాను 1998లో గ్రామ శివారులో భూమిని కొనుగోలు చేసి పట్టాపాసు పుస్తకం కలిగి ఉన్నానని, తనకు ఎలాంటి నోటీసులు ఇవ్వకుండా వేరే వారి పేరిట మార్పు చేశారని ఫిర్యాదు చేశాడు.



పోడు పట్టాల కోసం రైతుల ధర్నా


అంగన్‌వాడీ ఉద్యోగులను పర్మినెంట్ చేయాలి
జిల్లాలోని అంగన్‌వాడీ ఉద్యోగులను పర్మినెంట్ చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి దుంపల రంజిత్‌కుమార్ డిమాండ్ చేశారు. అంగన్‌వాడీ ఉద్యోగులను పర్మినెంటు చేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్(సీఐటీయూ) ఆధ్వర్యంలో అంగన్‌వాడీ ఉద్యోగులు జిల్లా కేంద్రంలోని ఐబీ చౌరస్తా నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీ నిర్వహించారు. కలెక్టరేట్ ఎదుట నిరసన వ్యక్తం చేశారు. అనంతరం అదనపు కలెక్టర్ బి.రాహుల్‌కు వినతిపత్రం సమర్పించారు. ఎనంగదుల భానుమతి, సువర్ణ, మహేశ్వరి, చంద్రకళ, అనురాధ, సత్యవతి, విజయలక్ష్మి, రాజేశ్వరి, తదితరులు పాల్గొన్నారు.

విరాసత్ పట్టా చేయించండి



మాది కాసిపేట మండలం ధర్మారావుపేట గ్రామం. నా తండ్రి రమేశ్ 2006లో అనారోగ్యంతో మృతిచెందాడు. ఆయన పేరు మీద మూడెకరాల భూమి పట్టా ఉన్నది. నా పేరు మీద పట్టా చేయించాలని మార్చి 2021లో రెవెన్యూ అధికారులకు దరఖాస్తు చేసుకున్నాను. నేటి వరకు పట్టా కాలేదు. అధికారులు విచారణ జరిపి విరాసత్ పట్టా ఇప్పించాలి.
– అజ్మీరా దేవ్‌సింగ్, కాసిపేట

నా భూమి నాకు ఇప్పించండి



జన్నారం మండలం మురిమడుగు గ్రామంలో రెండెకరాల వ్యవసాయ భూమి ఉన్నది. నాకు ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. కొన్నేళ్లుగా ఆరోగ్యం బాగా లేకపోవడంతో సాగు చేయడం లేదు. నిర్మల్ జిల్లా దుస్తూరాబాద్ మండలం మల్లాపూర్‌కు చెందిన ఓ వ్యక్తి నా భూమిని ఆక్రమించుకుని సాగు చేసుకుంటున్నాడు. నా భూమి ఇప్పించేలా చర్యలు తీసుకుని న్యాయం చేయండి.
– మాకు చిన్న ఎర్రయ్య, జన్నారం

పోడు పట్టాలు ఇప్పించాలి
కోటపల్లి మండలం కొండపేట గ్రామానికి చెందిన రైతులు తమ వ్యవసాయ భూములకు పోడు పట్టాలు ఇప్పించాలని డిమాండ్ చేశారు. సమీకృత కలెక్టరేట్ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. 60 కుటుంబాలకు చెందిన తాము సుమారు గత 20ఏళ్లుగా ఆ భూములపై ఆధారపడి వ్యవసాయం చేసుకుంటూ జీనం సాగిస్తున్నామని తెలిపారు. సర్వే చేసి పోడు పట్టాలు ఇప్పించాలని, అటవీ అధికారులు పెట్టిన అక్రమ కేసులు ఎత్తి వేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో కుర్మ మల్లు, కుర్మ పోసు, బండి లక్ష్మి, బండి పోచక్క, లక్ష్మి, రైతులు పాల్గొన్నారు.

పేదలకు ఇళ్ల స్థలాల పట్టాలు ఇవ్వాలి
లక్సెట్టిపేట మున్సిపాలిటీ పరిధిలోని ఊత్కూర్ శివారు సర్వే నంబర్ 375లోని ప్రభుత్వ భూమిలో అక్రమ నిర్మాణాలను నిలిపి వేసి పేదలకు ఇళ్ల స్థలాలకు కేటాయించాలని సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసి ఏరియా కార్యదర్శి దొండ ప్రభాకర్, డివిజన్ కార్యాదర్శి లాల్ కుమార్ డిమాండ్ చేశారు. నాయకులు పేదలతో కలిసి కలెక్టరేట్ ఎదుట నిరసన వ్యక్తం చేశారు.

గ్రంథాలయాల వారోత్సవాలు షురూ



గర్మిళ్ల హైస్కూల్‌లో పఠనం చేస్తున్న విద్యార్థులు

మంచిర్యాలఅర్బన్: ఒకటో తరగతి నుంచి పదో తరగతి విద్యార్థుల్లో పఠన నైపుణ్యం పెంపొందించి వారిని స్వతంత్ర పాఠకులుగా మార్చే లక్ష్యంతో సర్కారు పాఠశాలల్లో జూన్ 26 నుంచి జూలై 31 వరకు పఠనోత్సవం నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా ఈ నెల 10 నుంచి 15వరకు చేపట్టే గ్రంథాలయ వారోత్సవాలు సోమవారం నుంచి ప్రారంభమయ్యాయి. మొదటి రోజు పఠనోత్సవం గ్రంథాలయ వారోత్సవాలు ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. పిల్లలతో పుస్తక పఠనం చేయించారు. వారోత్సవాల్లో చేపట్టే కార్యక్రమాలను డీఈవో యాదయ్య వివరించారు.

రోజుకో కార్యక్రమం ఇలా..
11న పుస్తక పఠనం అవశ్యకతపై ఇంటింటికి ర్యాలీ చేపట్టనున్నారు. పుట్టినరోజు, వివిధ సందర్భాల్లో పిల్లలకు బహుమతిగా పుస్తకాలను అందజేయడంపై తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తారు. 12, 13న పాఠశాల గ్రంథాలయానికి పుస్తకాలను సేకరించే కార్యక్రమం చేపట్టాలి. ప్రతీ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు, ఉపాధ్యాయుడు దాతల నుంచి విద్యార్థులకు ఉపయోగపడే వివిధ రకాల కథల పుస్తకాలు సేకరించి గ్రంథాలయాల్లో అందుబాటులో ఉంచాలి. 14న పఠన సామగ్రి అభివృద్ధి, విద్యార్థులతో వార్తపత్రికల్లో పిల్లల పేజీల్లో ఉండే కథలు సేకరించడం, బొమ్మలు, వివిధ రకాల పజిల్స్ వాటిని కట్ చేసి అట్టలపై అతికించి రీడింగ్ కార్డ్స్ రూపొందించాలి. ఒక్కో పాఠశాలకు వంద చొప్పున స్వయంగా అభ్యసన సామగ్రి తయారు చేయించాలి. 15న పిల్లల తల్లిదండ్రుల సమావేశంలో పుస్తక పఠనం చేయించాలి. పిల్లలకు పఠన పోటీలు నిర్వహించాల్సి ఉంటుంది. అన్ని కార్యక్రమాలపై నివేదిక రూపొందించి జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో అందించాల్సి ఉంటుంది.

నిరుద్యోగులకు ఉద్యోగాలేవి..?

- యువజన కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు శివసేనారెడ్డి



మంచిర్యాలలో అంబేద్కర్ విగ్రహానికి నివాళులు

బెల్లంపల్లి/కాసిపేట/మంచిర్యాలటౌన్: వీరోచితంగా పోరాడి, ప్రాణత్యాగాలు చేసి తెచ్చుకున్న తెలంగాణ రాష్ట్రంలో నిరుద్యోగులకు ఉద్యోగాలేవని యువజన కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు శివసేనారెడ్డి ప్రశ్నించారు. యువజన కాంగ్రెస్ ఆధ్వర్యంలో చేపట్టిన యువ పోరాట యాత్ర సోమవారం జిల్లాలోని బెల్లంపల్లి, కాసిపేట, మంచిర్యాలలో సాగింది. ఈ సందర్భంగా మోటారుసైకిళ్ల ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా ప్రాంతాల్లో శివసేనారెడ్డి మాట్లాడుతూ నిరుద్యోగులకు నెలకు రూ.3వేల చొప్పున నిరుద్యోగ భృతి కల్పిస్తామని హామీనిచ్చి సీఎం కేసీఆర్ దగా చేశారని విమర్శించారు. వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రంలో ఖాళీగా ఉన్న 3.50లక్షల ఉద్యోగాలు భర్తీ చేస్తామని, నిరుద్యోగులకు నెలకు రూ.4వేల చొప్పున నిరుద్యోగ భృతి చెల్లిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు సంపత్‌రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి దాసరి ప్రతాప్, జిల్లా నాయకులు సల్లా మహేష్, టీపీసీసీ సభ్యుడు చిలుముల శంకర్, జిల్లా, అసెంబ్లీ నియోజకవర్గ నాయకులు ముడిమడుగుల మహేందర్, రొడ్డ శారద, బండి ప్రభాకర్, నాతరి స్వామి, వేముల కృష్ణ, ఎనగందుల వెంకటేష్, ఆనంద్ , తొంగల మల్లేష్, మాజీ సర్పంచ్ శంకరయ్య పాల్గొన్నారు.

హరితహారం లక్ష్యాలను పూర్తి చేయాలి



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ బి.రాహుల్

నస్పూర్: హరితహారంలో భాగంగా జిల్లాకు కేటాయించిన లక్ష్యాలను పూర్తి చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ బి.రాహుల్ అన్నారు. సోమవారం నస్పూర్‌లోని సమీకృత కలెక్టరేట్‌లో జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి శేషాద్రి, జిల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వర్‌రావుతో కలిసి జిల్లా అధికారులతో తెలంగాణకు హరితహారం, జిల్లా గ్రామ పంచాయతీ భవన నిర్మాణ కార్యక్రమం నిర్వహణపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలకు 45.21 లక్షల మొక్కలు లక్ష్యంగా కేటాయించగా ఇప్పటివరకు 13 లక్షలు మాత్రమే పూర్తి చేసినట్లు తెలిపారు. జిల్లాలో 82 గ్రామ పంచాయతీ భవనాల నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయని, మిగతావాటి పనుల ప్రారంభానికి చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో అటవీ రేంజ్ అధికారులు, డివిజన్ పంచాయతీ అధికారులు, సింగరేణి జీఎంలు, పరిశ్రమల శాఖ జీఎం, మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీఓలు పాల్గొన్నారు.

సిమ్స్‌లో మెడికల్ సీట్లకు దరఖాస్తు చేసుకోవాలి

శ్రీరాంపూర్: రామగుండంలో రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన సింగరేణి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్(సిమ్స్)లో సింగరేణికి కేటాయించిన మెడికల్ సీట్లకు అధికారులు, ఉద్యోగుల పిల్లలు దరఖాస్తు చేసుకోవాలని సింగరేణి డైరెక్టర్(ఫైనాన్స్, పర్సనల్) యన్.బలరాం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంబీబీఎస్ సీట్లలో ఏడు సింగరేణి పిల్లలు పొందే అవకాశం ఉందని, ఈ నెల 14లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. నీట్ ర్యాంకు ఆధారంగా ఎంపిక చేస్తారని, పిల్లల తల్లిదండ్రులు పనిచేసే గనులు, డిపార్టుమెంట్ల అధికారుల నుంచి నిర్దేశిత నమూనా ధ్రువీకరణ పత్రాలను తీసుకొని దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు.

12న స్పోర్ట్స్ స్కూల్‌లో ప్రవేశాల పోటీలు

మంచిర్యాలటౌన్: తెలంగాణ రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ ఆధ్వర్యంలో హకీంపేట్, ఆదిలాబాద్, కరీంనగర్ స్పోర్ట్స్ స్కూల్‌లో ప్రవేశాలకు జిల్లా స్థాయి ఎంపిక పోటీలు 12, 13వ తేదీల్లో నిర్వహించనున్నట్లు జిల్లా యువజన క్రీడల శాఖ అధికారి శ్రీకాంత్‌రెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 12న ఉదయం 9 గంటల్లోపు విద్యార్థులు జిల్లా కేంద్రంలోని జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాల మైదానానికి హాజరు కావాలని కోరారు. ప్రతీ తరగతికి 20 మంది బాలురు, 20 మంది బాలికలను ఎంపిక చేసి రాష్ట్రస్థాయికి పంపిస్తారని, రాష్ట్రస్థాయిలో ఈ నెల 25న ఎంపిక పోటీలు ఉంటాయని పేర్కొన్నారు.

క్లుప్తంగా

గుడుంబా స్థావరాలపై దాడులు

నెన్నెల(బెల్లంపల్లి): మండలంలోని నెన్నెల, చిన్నలంబాడితండా, పెద్దలంబాడితండాల్లోని గుడుంబా స్థావరాలపై ఎస్సై శ్యాంపటేల్ ఆధ్వర్యంలో సోమవారం ఎక్సైజ్ సిబ్బంది, పోలీసులు సంయుక్తంగా దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో మామిడి తోటలు, పంటచేలల్లో భూమిలో పాతిపెట్టిన వెయ్యి లీటర్ల బెల్లంపానకం ధ్వంసం చేశారు. అనంతరం ఇంటింటా సోదాలు నిర్వహించారు. దాడుల్లో జిల్లా టాస్క్‌ఫోర్స్ సీఐ సమ్మయ్య, మంచిర్యాల ఎక్సైజ్ సీఐ నరేందర్, బెల్లంపల్లి ఎక్సైజ్ సీఐ దీపక్‌పాండే, చెన్నూర్ ఎక్సైజ్ ఎస్సై లక్ష్మణ్ పాల్గొన్నారు.

గుడుంబా పట్టివేత

భీమిని: కన్నెపల్లి మండలంలోని జజ్జరవెల్లిలో సోమవారం గుడుంబా పట్టుకున్నట్లు ఎస్సై నరేష్ తెలిపారు. గ్రామానికి చెందిన తాళ్లపల్లి ప్రశాంత్, మంచికట్ల రోజ వద్దనుంచి గుడుంబా ప్యాకెట్లను స్వాధీనం చేసుకుని ఎక్సైజ్ అధికారులకు అప్పగించినట్లు ఆయన పేర్కొన్నారు. వారిపై కేసులు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు తెలిపారు.

నిలకడగా ఎల్లంపల్లి ప్రాజెక్ట్ నీటిమట్టం

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండలం గుడిపేట వద్ద ఉన్న ఎల్లంపల్లి(శ్రీపాద సాగర్) ప్రాజెక్ట్ నీటిమట్టం నిలకడగా ఉంది. పూర్తి స్థాయి నీటిమట్టం 20.175 టీఎంసీలకు గాను 13.008 టీఎంసీల నీరుంది. ఇన్‌ఫ్లో కింద పార్వతి పంప్‌హౌజ్ నుంచి 13,050 కూసెక్కుల నీరు ప్రాజెక్ట్‌లోకి చేరుతోంది. నంది పంప్‌హౌజ్‌కు 6,300 క్యూసెక్కులు, హైదరాబాద్ మెట్రో వాటర్ వార్క్స్ పథకానికి 331 క్యూసెక్కులు వదులుతున్నారు.

రోడ్డు ప్రమాదంలో కానిస్టేబుల్ మృతి


రాయమల్లు (ఫైల్)

మందమర్రిరూరల్: రోడ్డు ప్రమాదంలో కానిస్టేబుల్ మృతి చెందిన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. మందమర్రి పోలీస్ స్టేషన్ పరిధిలోని యాపల్ ప్రాంతానికి చెందిన ఏఆర్ కానిస్టేబుల్ రాయమల్లు (36) ఆదివారం రాత్రి స్థానిక బుర్దగూడెం సమీపంలోని హీరో హోండా షోరూం వద్ద నుంచి నడుచుకుంటూ వెళ్తున్నాడు. గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో తీవ్రగాయాలయ్యాయి. ముందుగా మంచిర్యాల ఆస్పత్రికి అక్కడి నుంచి హైదరాబాద్‌కు తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు. ఇదిలా ఉండగా కుటుంబ కలహాలతో మృతుడు సుమారు 12 ఏళ్లగా భార్యకు దూరంగా ఉంటున్నట్లు సమాచారం. ఇంటి నుంచి ప్రమాదం జరిగిన చోటుకి సుమారు రెండు కిలోమీటర్ల దూరం ఉంటుంది. అక్కడి వరకు నడుచుకుంటూ వెళ్లడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

మాలమహానాడు రాష్ట్ర ఉపాధ్యక్షురాలిగా తిరుమల

బెల్లంపల్లి: తెలంగాణ మాల మహానాడు రాష్ట్ర ఉపాధ్యక్షురాలుగా బెల్లంపల్లికి చెందిన మద్దెల తిరుమల నియామకం అయ్యారు. హైదరాబాద్ వేదికగా సోమవారం జరిగిన సంఘం ప్రత్యేక సమావేశంలో తిరుమలను ఎన్నుకున్నారు. మాల సంఘాల జేఏసీ రాష్ట్ర చైర్మన్ చెరుకు రాంచందర్, మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు మంత్రి నర్సింహయ్య నియామకపత్రం అందజేశారు.

ప్రభంజనం ఆపుదాం..

- నేడు ప్రపంచ జనాభా దినోత్సవం

'దేవుడా ఓ మంచి దేవుడా.. మాకు తినడానికి తిండినిచ్చావు.. ఇలాగే దేశంలోని తొంభై కోట్ల మందికి ఇవ్వాలి.. ప్రపంచంలోని.. నాకు నంబర్ సరిగ్గా తెలియదు.. ఎంత ఉంటే అంత మందికి ఇలాగే ఇవ్వాలని కోరుకుంటున్నా'.. అని ఓ సినిమాలో హీరో ప్రార్థిస్తాడు. అది హాస్యాన్ని పంచినా మరి నేడు అందరికీ ఆహారం అందించడం, అందరి అవసరాలు తీర్చడం, అందరికీ ఉపాధి కల్పించడం సాధ్యమవుతుందా? అంటే ఆలోచించాల్సిందే. నానాటికి పెరుగుతున్న జనాభా.. తద్వారా తలెత్తే దుష్పరిణామాలను ప్రజలకు వివరించేందుకు, వారికి ఆయా సమస్యలపై అవగాహన కలిగించేందుకు ఏటా జూలై 11న ప్రపంచ జనాభా దినోత్సవం నిర్వహిస్తున్నారు. 1987లో ప్రపంచ జనాభా ఐదు బిలియన్లకు చేరుకున్న రోజు జూలై 11. కాబట్టి ఆరోజును 'ప్రపంచ జనాభా దినం'గా ఐక్యరాజ్యసమితి గుర్తించింది.



- తగ్గితేనే నీరా'జనం'...
- మితిమీరితే అనర్థమే...
- వనరుల కొరతకు మూలం...
- రోజురోజుకూ పెరుగుతున్న జనాభా

ఉమ్మడి జిల్లా వివరాలు

జిల్లా	మొత్తం జనాభా	జిల్లా వైశాల్యం (చ.కి.మీ.లు)	జనసాంద్రత (కి.మీ.కు)
నిర్మల్	7,09,418	3,731.35	190
ఆదిలాబాద్	7,08,972	3,971.31	179
మంచిర్యాల	8,07,037	3,908.04	207
కుమురంభీం	5,15,812	4,491.28	115



నిర్మల్ ఖిల్లా: 'ఇంతింతై వటుడింతై' అన్న చందంగా నానాటికీ పెరుగుతున్న జనాభా అవసరాలకు తగ్గట్లుగా ప్రకృతి వనరులు తరిగిపోతున్నా వాటిని పొదుపుగా వాడుకునేందుకు ఎవరూ ప్రయత్నించడం లేదు. కాబట్టి ప్రకృతి వనరుల ఆవశ్యకత గురించి ప్రజలకు అవగాహన కల్పిస్తూ, పర్యావరణాన్ని కాపాడుకునేలా చేయాలి. అలాగే.. జనాభా పెరుగుదల వల్ల కలిగే నష్టాలు, నిరక్షరాస్యత, భూమిపై స్థలం సరిపోకపోవడం.. లాంటి సమస్యలను ప్రభుత్వాలు ప్రజల్లోకి తీసుకెళ్లి చైతన్యపర్చాలి. ఈ విషయాలపై వారికి క్షుణ్నంగా అవగాహన కల్పించి, స్వచ్ఛందంగా కుటుంబ నియంత్రణ ఆపరేషన్ చేయించుకునేలా ప్రోత్సహించాలి. ఈ రకంగా ఎవరికివారు జనాభా నియంత్రణకు పూనుకున్నట్లయితే భారాన్ని కాస్తయినా తగ్గించినవారం అవుతాం.

మితిమీరితే ఏర్పడే సమస్యలు ఇవే

జనాభా పెరుగులతో ప్రకృతి సమతుల్యం దెబ్బతింటుంది. అడవులు అంతరించిపోతాయి. జనాభాకు అనుగుణంగా అవసరాలు కూడా తీర్చాలి. దీంతో తరాల మధ్య అంతరాలు పెరుగుతాయి. ఆకలికేకలు, ఆరోగ్యం ఇబ్బందులు పెడతాయి. జనాభా పెరుగుదలను అడ్డుకుంటేనే మనుగడ సాధ్యం. లేదంటే సమస్యలే నిత్యం స్వాగతం చెబుతాయి. వనరులు సైతం తరిగిపోతున్నాయి. అవసరాలకు మించి వాడటంతో సమస్యలే ఎదురవుతాయని నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

చైనాను దాటేసిన భారత్....

ప్రపంచంలోనే అత్యధిక జనాభా ఉన్న దేశంగా భారత్ నిలిచింది. చాలా కాలంగా మొదటి స్థానంలో కొనసాగుతున్న చైనాను అధిగమించింది. అయితే ఈ రెండు దేశాల మధ్య అంతరాయం చాలా తక్కువే కావడం గమనార్హం. ఈ ఏడాది ఏప్రిల్‌లో విడుదల చేసిన ఐక్యరాజ్య సమితి అంచనా నివేదిక ప్రకారం చైనాలో 142.5 కోట్ల జనాభా ఉంటే భారతదేశంలో ప్రస్తుతం 142.8 కోట్ల జనాభా ఉంది. అంటే చైనా కంటే ఇండియా జనాభా దాదాపు మూడు మిలియన్లు ఎక్కువ. భూభాగం పరంగా చైనా పరిధి విశాలంగా ఉండగా భారతదేశం పరిధి చైనాకంటే తక్కువగా ఉంది.

నియంత్రిస్తేనే మనుగడ



పరిమిత వనరులున్న భారతదేశంలో జనాభాను నియంత్రించుకోవాల్సిన అవసరం ఉంది. ఈ బాధ్యతను ప్రభుత్వాలే కాదు ప్రజలు స్వీయ ఆచరణలో పెడితే జనాభా పెరుగుదలను నియంత్రించవచ్చు. ప్రస్తుతం ఉన్న పరిమిత వనరులను భావితరాలకు అందించవచ్చు.

– పీజీ రెడ్డి, అసిస్టెంట్ ప్రొఫెసర్, ప్రభుత్వ డిగ్రీ కళాశాల

కవితను కలిసిన టీబీజీకేఎస్ నాయకులు


కవితకు పుష్పగుచ్ఛం ఇస్తున్న రాజిరెడ్డి

శ్రీరాంపూర్: గుర్తింపు సంఘం టీబీజీకేఎస్ కేంద్ర ప్రధాన కార్యదర్శి మిర్యాల రాజిరెడ్డి, శ్రీరాంపూర్ ఏరియా ఉపాధ్యక్షుడు కే సురేందర్ రెడ్డి సోమవారం యూనియన్ గౌరవ అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కవితను జగిత్యాలలో కలిశారు. కారుణ్య ఉద్యోగాల్లో డిపెండెంట్ల వయస్సు 35 నుంచి 40 సంవత్సరాలకు పెంచాలని, మారుపేర్లతో ఉద్యోగం చేసే వారి పేర్లను సొంతపేర్లుగా మార్చిడి చేయాలని, డిస్మిస్ కార్మికులకు మరో అవకాశం ఇచ్చేలా సింగరేణి యాజమాన్యంతో మాట్లాడి పరిష్కరించాలని కోరారు.

లంపీస్కిన్‌తో లేగదూడ మృతి

భీమారం(చెన్నూర్): మండలంలోని పోతన్‌పల్లిలో ఎడ్ల నారాయణకు చెందిన లేగదూడ సోమవారం లంపీస్కిన్‌తో మృతి చెందింది. కొన్ని రోజులుగా లేగదూడ చర్మంపై ఉండలుగా ఏర్పడిందని చికిత్స చేయించినా వ్యాధి నయంకాలేదని బాధిత రైతు వాపోయాడు. గ్రామంలో ఇప్పటికే మూడు పశువులు లంపీస్కిన్‌తో మృతి చెందాయని, మళ్లీ లేగదూడ మృతి చెందడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా పశువైద్యాధికారులు స్పందించి గ్రామాల్లోని పశువులకు వ్యాధులు సోకకుండా చర్యలు చేపట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు. దీనిపై మండల పశువైద్యాధికారి రాకేశ్‌శర్మను సంప్రదించగా పోతన్‌పల్లిలో లేగదూడ లంపీస్కిన్‌తోనే మృతి చెందిందని నిర్ధారించారు. గతేడాది లంపీస్కిన్ వ్యాధి సోకకుండా పశువులకు టీకాలు వేశామని, అయితే మూడు నెలల దూడలు మాత్రం మృతి చెందుతున్నాయని, వాటికి టీకాలు వేసేందుకు ప్రభుత్వం అనుమతి ఇవ్వలేదన్నారు.

సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టాలి

- ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి చాహత్ బాజ్‌పాయ్


అర్జీలు స్వీకరిస్తున్న పీవో చాహత్ బాజ్‌పాయ్

ఉట్నూర్‌రూరల్(ఖానాపూర్): గిరిజనుల సమస్యల పరిష్కారానికి సత్వర చర్యలు చేపట్టాలని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి చాహత్ బాజ్‌పాయ్ అధికారులను ఆదేశించారు. సోమవారం ఉట్నూర్ ఐటీడీఏ కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణికి వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన గిరిజనుల నుంచి అర్జీలు స్వీకరించారు. కెరమెరి మండలం రాంపూర్‌కు చెందిన కోట్నాక్ విజయ్ దివ్యాంగుల పింఛన్ మంజూరు చేయాలని, తమ గ్రామానికి రోడ్డు మంజూరు చేయాలని గుడిహత్నూర్ మండలం న్యూసోమర్‌పేట్ గ్రామస్తులు, దస్తురాబాద్ మండలం మున్యాల్‌కు చెందిన భుక్యా వంశీ తనకు స్వయం ఉపాధికోసం ఆర్థికసాయం అందించాలని, ఆర్‌వోఎఫ్ఆర్ హక్కు పత్రాలు మంజూరు చేయాలని నెన్నెల మండలం దమ్మిరెడ్డి గ్రామస్తులు కోరారు. ఇవేకాకుండా ఇంకా పింఛన్లు, డబుల్ బెడ్రూం ఇళ్లు, ఆశ్రమ పాఠశాలల్లో ప్రవేశాలు, స్వయం ఉపాధి పథకాల మంజూరు, వ్యవసాయ, రెవెన్యూ శాఖలకు సంబంధించిన సమస్యలపై అర్జీలు అందజేశారు. అర్జీలు స్వీకరించిన పీవో సమస్యల పరిష్కారానికి సంబంధిత శాఖల అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో శిక్షణ సహాయ కలెక్టర్ పి.శ్రీజ, డీడీ దిలీప్‌కుమార్, ఏపీవో కనక భీంరావు, ఏడీఎంఅండ్‌హెచ్‌వో కుమ్ర బాలు, ఏవో రాంబాబు, ఏపీవో పీవీటీజీ ఆత్రం భాస్కర్, పీహెచ్‌వో సందీప్, జేడీఎం నాగభూషణం, ప్రిన్సిపాల్ మెస్రం మనోహర్, డీపీవో ప్రవీణ్, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో మూడు గేదెలు మృతి

భీమారం: మంచిర్యాల జిల్లా భీమారం మండలం పోలంపల్లి శివారులో సోమవారం విద్యుదాఘాతంతో మూడు గేదెలు మృతి చెందాయి. భీమారం గ్రామంలోని దారవేణి లింగయ్య, మెండె సాయిలు, కొమ్ము పోశంకు చెందిన గేదెలు సోమవారం మేతకు వెళ్లి పోలంపల్లి పరిధిలోని వ్యవసాయ పంపుసెట్లకు విద్యుత్ సరఫరా చేసే స్తంభానికి తాకడంతో విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందాయి. విద్యుత్ శాఖ అధికారుల నిర్లక్ష్యం వల్లే ప్రమాదం జరిగిందని బాధితులు ఆరోపిస్తున్నారు. సంఘటన స్థలాన్ని విద్యుత్‌శాఖ సిబ్బంది పరిశీలించారు.

పురుగుల మందు తాగి ఒకరు ఆత్మహత్య


శ్రీనివాస్ (ఫైల్)

మంచిర్యాలక్రైం: పురుగుల మందు తాగి ఒకరు ఆత్మహత్య చేసుకున్న సంఘటన పట్టణంలో చోటు చేసుకుంది. సీఐ రాజు తెలిపిన వివరాల ప్రకారం జిల్లా కేంద్రంలోని కాలేజ్ రోడ్‌కు చెందిన ఇంగం శ్రీనివాస్ (40) మెడికల్ ఏజెన్సీ నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. సోమవారం ఇంటినుంచి బయటకు వెళ్లి తిరిగిరాలేదు. పోలీసులకు సమాచారం అందించడంతో ఫోన్ కాల్ ఆధారంగా లాడ్జీలోకి వెళ్లి పరిశీలించగా పురుగుల మందు తాగి అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు.

కార్మికుల సమస్యలు పట్టని కాంట్రాక్టర్


సమ్మె చేస్తున్న కాంట్రాక్టు కార్మికులు

- ఆరు రోజులుగా సమ్మెలోకి కాంట్రాక్టు కార్మికులు
- కాంట్రాక్టర్ తీరుపై తల పట్టుకుంటున్న అధికారులు

కాసిపేట(బెల్లంపల్లి): మందమర్రి ఏరియా కేకే ఓసీపీ కాంట్రాక్టర్ తీరుతో అధికారులు తలలు పట్టుకుంటున్నారు. సింగరేణి ఉన్నతాధికారుల ఆదేశాలు సైతం బేఖాతర్ చేస్తున్నా అతనికి ప్రభుత్వ పెద్దల అండదండలు ఉండడంతో ఏంచేయలేకపోతున్నారనే విమర్శలు ఉన్నాయి. ఆర్‌వీఆర్ కాంట్రాక్టు సంస్థ ఆధ్వర్యంలో ఓసీపీలో పనిచేస్తున్న కార్మికులు తమ సమస్యలు పరిష్కరించాలని గత నెల 22, 23, 24 తేదీలలో సమ్మె చేశారు. మందమర్రి సీఐ మహేందర్‌రెడ్డి, కేకేఓసీ పీవో రమేశ్‌కుమార్ కార్మికులు, సంస్థ యాజమాన్యంతో చర్చలు జరిపినా ప్రయోజనం లేకుండా పోయింది. వేతనాల పెంపుపై రెండునెలల క్రితం గోదావరిఖనిలో ఈ సంస్థకు చెందిన కార్మికులు సమ్మెకు దిగారు. వారికి మద్దతు తెలిపేందుకు సిద్ధపడగా ఇక్కడి కాంట్రాక్టు సంస్థ బాధ్యులు అక్కడ ఏది ఒప్పందం అయినా ఇక్కడ అమలు చేస్తామని, సమ్మెలోకి దిగవద్దని కోరారు. అక్కడ బేసిక్ వేతనం రూ.20వేలకు పెంచడంతో తమకు కూడా అమలు చేయాలని కోరగా తప్పించుకు తిరుగుతున్నారని కార్మికులు ఆరోపిస్తున్నారు. అధికారులను అడిగితే 24 మస్టర్లు చేసిన వారికి వెయ్యి రూపాయలు, 26 మస్టర్లు చేసిన వారికి మరో ఐదు వందలు ప్రోత్సాహకంగా ఇస్తున్నట్లు చెప్తున్నారన్నారు. బేసిక్‌లో కలిపి ఇస్తే చాలని, ప్రోత్సాహకంగా వద్దనడంతో ఏరియా జీఎం మోహన్‌రెడ్డి, పీవో రమేశ్‌కుమార్ సదరు కాంట్రాక్టు సంస్థ యాజమానితో మాట్లాడి కార్మికులకు హామీ ఇచ్చినట్లు తెలిపారు. ఈ నెల1న సంబంధిత అధికారి రానున్నారని, అతనితో చర్చలు జరిపి సమస్య పరిష్కరిస్తామని, సమ్మె చేసిన మూడురోజుల మస్టర్లు ఇస్తామని హామీ ఇవ్వడంతో సమ్మె విరమించి విధులకు హాజరయ్యారు. ఇప్పటికీ సదరు కాంట్రాక్టు సంస్థ బాధ్యుడు రాకపోవడంతో బుధవారం నుంచి కాంట్రాక్టు కార్మికులు మళ్లీ సమ్మెలోకి దిగారు.

ఆటో బోల్తా.. ఏడుగురికి గాయాలు

నెన్నెల(బెల్లంపల్లి): మండలంలోని బొప్పారం నర్సరీ వద్ద సోమవారం అదుపుతప్పి ఆటో బోల్తా పడిన ఘటనలో ముగ్గురికి తీవ్రంగా, నలుగురికి స్వల్ప గాయాలైనట్లు పోలీసులు తెలిపారు. మైలారం గ్రామానికి చెందిన ఆటో బెల్లంపల్లి నుంచి మైలారం వైపు వెళ్తుండగా నర్సరీ వద్ద రోడ్డు దిగి ఎక్కే క్రమంలో బోల్తా పడింది. జోగాపూర్‌కు చెందిన నికాడి విమల, మైలారంకు చెందిన కుర్సింగ రాజక్క, డ్రైవర్ దుగుట అన్వేష్ తలకు తీవ్ర గాయాలయ్యాయి. మైలారంకు చెందిన బోగారపు రమ్య , గొల్లపల్లికి చెందిన తుమ్మనవేణి తిరుపతి, జోగాపూర్‌కు చెందిన నికాడి లచ్చన్న, రుద్రాపూర్‌కు చెందిన కొట్రంగి అరుణలకు స్వల్ప గాయాలయ్యాయి. క్షతగాత్రులను 108లో బెల్లంపల్లి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. రోడ్డుకు ఇరువైపులా మొరం పోయకపోవడంతోనే నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయని, రోడ్డుకు సైడ్ బర్మర్ పోయించాలని మండల ప్రజలు కోరుతున్నారు.

ఆర్కే 6 గనిలో కార్మికునికి గాయాలు

శ్రీరాంపూర్: ఆర్కే 6 గనిలో జరిగిన ప్రమాదంలో గైని రాజేందర్ అనే జనరల్ మజ్దూర్ కార్మికునికి గాయాలయ్యాయి. సేఫ్టీ డిపార్టుమెంట్‌లో పనిచేస్తున్న రాజేందర్ సోమవారం జనరల్ షిఫ్ట్ విధులకు హాజరయ్యాడు. గని భూగర్భంలోని 5 సీమ్/25 లెవల్/ 3 డిప్ నార్త్ సైడ్‌లో బ్రాటీస్ క్లాత్(పరదా) కడుతుండగా సమీపంలోనే ఓ రూఫ్‌బోల్టర్ యంత్రం నడుస్తుంది. బోల్టర్‌కు, కంప్రెషర్‌కు మధ్య ఉండే వాక్యూమ్ పైప్ జాయింట్ సడెన్‌గా ఊడిపోయి కార్మికుడి కాలికి బలంగా తాకడంతో తీవ్రగాయాలయ్యాయి. తోటి కార్మికులు వెంటనే గని ఉపరితలానికి తీసుకువచ్చి ఆర్కే 8 డిస్పెన్సరీకి, అక్కడి నుంచి రామకృష్ణాపూర్ ఏరియా ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు ఎడమకాలు ఫ్యాక్చర్ అయినట్లు గుర్తించి కరీంనగర్‌కు రెఫర్ చేశారు.

పడటం వల్లే గాయాలు: గని మేనేజర్

కార్మికుడు పనిచేసే క్రమంలో కాలుజారీ పడటంతోనే కాలు విరిగిందని ఆర్కే 6 గని మేనేజర్ తిరుపతి తెలిపారు. ప్రమాదంపై విచారణ చేస్తున్నామన్నారు.

పరీక్షల్లో ఫెయిలవుతానేమోనని ఆత్మహత్య


ఉదయ్‌కిరణ్(ఫైల్)

జైపూర్: పరీక్షల్లో ఫెయిలవుతానేమోనని భయపడి ఓ విద్యార్థి ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలో చోటు చేసుకుంది. జైపూర్ మండలం ఇందారం గ్రామానికి చెందిన చేగొండ రజిత, రాంకుమార్ దంపతుల కుమారుడు ఉదయ్‌కిరణ్ (20) చిన్నప్పటి నుంచి చదువులో వెనుకబడ్డాడు. పదోతరగతిలో ఫెయిల్ కావడతో ఓపెన్ డిగ్రీలో చేరాడు. ఇటీవలే ద్వితీయ సంవత్సరం పరీక్షలు రాశాడు. ఫలితాలు వచ్చే క్రమంలో ఫెయిలవుతానేమోనని భయాందోళన చెందాడు. దీంతో సోమవారం ఇంట్లో ఏవరూ లేని సమయంలో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గమనించిన తల్లిదండ్రులు మంచిర్యాల ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై ఉపేందర్‌రావు తెలిపారు.

పోగొట్టుకున్న నగదు అప్పగింత


నగదును అప్పగిస్తున్న ఎస్సై

లక్సెట్టిపేట: పట్టణానికి చెందిన దిలీప్ ఈ నెల 8న వ్యాపారంలో భాగంగా కరీంనగర్ నుంచి లక్సెట్టిపేటకు ఆర్టీసీ బస్సులో వస్తుండగా బ్యాగ్ బస్సులో మరిచి వెళ్లిపోయాడు. అందులో రూ. 2 లక్షల 70 వేలు ఉన్నాయని పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు చాకచక్యంగా వ్యవహరించి బస్సు దిగిన ప్రదేశాన్ని గమనించి ఇల్లంతకుంటకు చెందిన రాజు అదే బస్సులో ఉన్నాడని గమనించారు. అతన్ని విచారించగా తాను గుర్తించక తీసుకు వెళ్లానని చెప్పి డబ్బులను తిరిగి అప్పజెప్పినట్లు తెలిపారు. బోడకుంట తిరుపతి, అంజిబాబులను అభినందించారు.

నేడు అభ్యర్థులకు కౌన్సెలింగ్

మంచిర్యాలఅర్బన్: జిల్లాలో గుర్తించిన పోస్టుల భర్తీకి కాంట్రాక్టు పద్ధతిన పనిచేయడానికి 2019 నవంబర్ 6న నిర్వహించిన రాతపరీక్షలో ఎంపికైన అభ్యర్థులకు ఈ నెల 11న కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు డీఈవో యాదయ్య తెలిపారు. ఎంఐఎస్ కో–ఆర్డినేటర్, డాటాఎంట్రీ ఆపరేటర్లు, సిస్టమ్ ఎనాలిస్టు, అసిస్టెంట్ ప్రోగామర్ పోస్టులు భర్తీకి తుది జాబితాను సోమవారం డీఈవో కార్యాలయం నోటీసు బోర్డుపై ప్రదర్శించినట్లు తెలిపారు. ఈ నెల 11న ఉదయం 11గంటలకు డీఈవో కార్యాలయంలో నిర్వహించే కౌన్సెలింగ్‌కు హాజరు కావాలని సూచించారు.

కిక్ బాక్సింగ్‌లో యువకుడి సత్తా



రజత పతకం అందుకుంటున్న సంజీవ్

బెల్లంపల్లిరూరల్: మండలంలోని చంద్రవెల్లి గ్రామానికి చెందిన రాసకొండ సంజీవ్ జాతీయ స్థాయి కిక్ బాక్సింగ్ పోటీల్లో సత్తా చాటాడు. ఈ నెల 1 నుంచి 5వరకు పంజాబ్ రాష్ట్రంలోని జలంధర్‌లో వాకో ఇండియా ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయ స్థాయి సీనియర్స్, మాస్టర్స్ కిక్ బాక్సింగ్ చాంపియన్ షిప్ పోటీల్లో పాల్గొన్నాడు. 67 కిలోల విభాగం పోటీల్లో సత్తా చాటి రజత పతకాన్ని అందుకున్నాడు. జాతీయ స్థాయి పోటీల్లో అత్యుత్తమగా రాణించిన సంజీవ్‌ను తెలంగాణ కిక్ బాక్సింగ్ క్రీడాకారులు, గ్రామస్తులు అభినందించారు.